
# ఆమెకు ఇద్దరు

**- యం. ఉదయభాను**



**ప**రబ్రహ్మం ఇంటి పనంతా ( అంటే వంటావార్పు అన్నమాట) పూర్తిచేసి ఫ్రెష్‌గా స్నానంచేసి తన అర్ధాంగి అయిన మహాలక్ష్మికి ఇష్టమైన సిల్కులాల్చి, పైజమా వేసుకుని వరండాలో పచార్లు చేస్తున్నాడు.

మాటిమాటికి గడియారంవైపు అసహనంగా చూస్తున్నాడు. మహాలక్ష్మి ఇంకా రాలేదేమిటా అని ప్రియురాలికై వేచే అభిసారికలా ఎదురుచూస్తున్నాడు. సమయం ఎనిమిది దాటింది.

నిజానికి ఈమధ్య మహాలక్ష్మి వేళకు ఇంటికి రావడంలేదు. ఆఫీసులో ఎవరో కొత్త స్టెనో కుర్రాడు చేరాడట. కాస్త కంటికి నజరుగా వుండమేకాక మినీ ప్యాంట్‌లు అవి వేసుకుని ఫ్యాషన్‌గా ఉన్నాడట. డ్రైవర్ చెబితే తెలిసింది. పరబ్రహ్మం భార్యకు ఎప్పుడు ఫోన్ చేసినా ఆ స్టెనో కుర్రాడే ఫోన్ తీస్తాడు. అమ్మగారు బిజీగా వున్నారంటూ మహాలక్ష్మి చేతికి ఫోన్ ఇవ్వడు. వాడి వరస చూస్తుంటే మంచి హోదాలో వున్న మహాలక్ష్మిని వల్లో వేసుకోవాలని ప్రయత్నం చేస్తున్న టక్కరి వాడిలాగున్నాడు. ఆ సంగతేదో ఈరోజు తేల్చుకోవాలనుకున్నాడు పరబ్రహ్మం. ఓసారి క్యాలెండర్‌వైపు చూసాడు.

ఆ రోజు తేదీ 2-2-2022.

కారు చప్పుడైతే రోడ్డుమీదకు ఆశగా చూశాడు. అది పక్కింటి సరస్వతిది. సరస్వతి, ఆమె మొగుడు సత్తిగాడు ట్రిమ్‌గా తయారై షికారుకెళ్తున్నారు. ఆ దృశ్యం చూడగానే పరబ్రహ్మం గుండె చెరుకురసం మిషన్‌లో వేసి తిప్పినట్టుగా బాధగా మూలిగింది.

పరబ్రహ్మం ఒక్కసారి ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్లిపోయాడు. పెళ్లికి ముందు మహాలక్ష్మి తనను ఎన్నిసార్లు సినిమాలు, షికార్లకి తీసుకువెళ్లింది. తనకిష్టమైన మిరపకాయ బజ్జీలను ఎన్నిసార్లు ఇప్పించిందో. ఆ రోజులు తలుచుకుంటే సిగ్గుల మొగ్గయ్యాడు. ఆ మధుర క్షణాలు తలచుకొంటూ డిజిటల్ సౌండ్ సిస్టంలో కలలు కనసాగాడు.

గేటుదగ్గర హారన్ వినిపించడంతో ఉలిక్కిపడి కిటికీలోనుండి చూశాడు. కారు వెనుక సీట్లో మహాలక్ష్మి పక్కనే కుర్ర స్టెనో మోహన్ కూర్చొని వున్నాడు. పైగా ఇద్దరూ వికవికలు. మహాలక్ష్మి కారు దిగి డ్రైవర్‌కు మోహన్‌ని వాళ్లింటి దగ్గర డ్రాప్ చేయమని చెప్పి కారు వీధి మలుపు తిరిగేవరకూ టాటా చెబుతూనే వుంది. లోపలికి రాగానే బ్రహ్మన్ని తిన్నావా లేదా అని కూడా అడక్కుండా తన గదిలోకి వెళ్లిపోయింది.

పరబ్రహ్మానికి అరికాలు మంట నెత్తికెక్కింది. అందంగా దువ్వుకున్న జుట్టు చెరిపేసుకున్నాడు. మహాలక్ష్మిని విషయమేంటో కనుక్కుందామని ఆవేశంగా ఆమె గదిలో అడుగు పెట్టబోయాడు. ఇంతలో ఎవరో చెయ్యిపట్టి లాగినట్టయి ఆగిపోయాడు. అదృశ్యంగా పరబ్రహ్మం తండ్రి రామలింగయ్య మాటలు వినిపించాయి.

''బ్బా... బ్బు... బ్రహ్మం.. ఆవేశపడకు నాయనా. మగవాడిగా పుట్టినందుకు అణుకువగా వుండాలి. ఆవేశం మగవాడికి పనికిరాదు. సంసారంలో భార్యదే పైచేయి. భార్యకు అనుకూలంగా నడుచుకోవడమే భర్తగా నీ విధి. సహనమే మగవాళ్లకు శ్రీరామరక్ష'' అలా తండ్రి అన్న మాటలు జ్ఞాపకం రాగానే సోడా గ్యాస్‌లా అతని కోపమంతా బుస్సుమని దిగిపోయింది. కళ్లు రెండు తుడుచుకున్నాడు. నెమ్మదిగా గదిలో అడుగుపెట్టాడు.

మహాలక్ష్మి బెడ్‌పై ఒదిగిపోయి వుంది. నెమ్మదిగా ఆమె కాళ్లకున్న సాండిల్స్ తీసి సరిగ్గా పడుకోబెట్టి గుండెలదాకా దుప్పటి కప్పాడు. వంటింట్లోకెళ్లి తనకిష్టమైన మిరపకాయ బజ్జీలన్నీ డస్ట్‌బిన్‌లో పడేసి గ్లాసెడు మంచినీళ్లు మాత్రం తాగి బెడ్‌రూమ్‌లో చాప పరుచుకుని పడుకున్నాడు. అతని కన్నీటికి దిండంతా తడిసిపోయింది.

ఇంతలో మంచంమీద మహాలక్ష్మి కలవరిస్తోంది.

''యూ నాటీ మోహన్. డోంట్ బి షై... నీకేం అన్యాయం చెయ్యను. ప్రామిస్. కమాన్. నీ అందం నా మతి పోగొడుతోంది. కమాన్...'' ఇంకా ఏం వినాల్సి వస్తుందోనని బ్రహ్మం అక్కడ వుండలేక బాల్కనీలోకి వెళ్లిపోయాడు. అతని కష్టాన్ని చూడలేక ప్రకృతి కూడా చలించినట్లుగా భోరున వర్షం కురుస్తోంది.

★★★

అలాగే తెల్లవారిపోయింది.

నీరసంగా పడుకుని వున్నాడు బ్రహ్మం. అతని పక్కనే టామీ కూడా పడుకుంది.

బద్ధకంగా లేచిన మహాలక్ష్మి టివి ఆన్ చేసింది. స్క్రీన్‌పై ఆ రోజు తేదీ పడింది 3.2.2022 అని. ఉదయం వార్తలు వస్తున్నాయి.

''మామగారి ఆరళ్లకు అల్లుళ్లు బలి. ఈ రోజు స్కోరు 150'' ఇంకా ఏదో చెబుతుంటే మహాలక్ష్మి విసుగ్గా టీవీ కట్టేసింది. సమయానికి కాఫీ చేతికి అందకపోవడంతో దిగ్గున లేచి బ్రహ్మం కోసం ఇల్లంతా కలియదిరిగి చూసింది. ఎక్కడా కనబడకపోవడంతో బాల్కనీలోకి వచ్చి చూసింది. బ్రహ్మం ఆదమరచి పడుకుని వున్నాడు. అతని పక్కలో టామీ. ఆ దృశ్యం చూసి జీర్ణించుకోలేకపోయింది మహాలక్ష్మి.

''బ్రహ్మం...'' అంటూ ఓ గావుకేక పెట్టింది.

ఉలిక్కిపడి లేచాడు బ్రహ్మం. అపరకాళిలా వున్న మహాలక్ష్మిని చూసి బెదిరిపోయాడు.

''నువ్వింత నీచుడివనుకోలేదు. పక్కలో టామిని పడుకోబెట్టుకుంటావా? అదీ నలుగురు చూసేలా బాల్కనీలో. నా పరువేం కావాలి? నీలాంటి బడుద్దాయిని చేసుకోవడమే బుద్ధి తక్కువ. ఇప్పుడే మీ నాన్నను పిలిచి అడుగుతాను మగపిల్లవాడ్ని ఇలాగేనే పెంచే పెంపకం?''

ఇంక మాట్లాడలేక అలసిపోయింది. అప్పటికే పక్కింటి సత్తిగాడు, ఎదురింటి వెంకట్, ఇతర మొగవాళ్లు ముగ్గులేయడం ఆపి వీళ్లనే చోద్యంగా చూస్తున్నారు.

పెళ్లాం కొట్టినందుకు కాదు తోడల్లుడు నవ్వినందుకు సామెతలా బ్రహ్మంకు తల కొట్టేసినట్టయింది. విసురుగా దొడ్లోకి వెళ్లిపోయి రాత్రివి పాచిగిన్నెలన్నీ ముందేసుకుని పరపరా తోమసాగాడు.

ఇంతలో హాల్లో ఫోన్ మోగింది. మహాలక్ష్మి ఫోన్ ఎత్తింది. అవతలివైపు స్వరం వినగానే ఆమె మొహం ప్రసన్నమైంది. కిలకిలా చిలకలా నవ్వుతూ మాట్లాడుతోంది. బ్రహ్మంకు ఆ ఫోన్ ఎవరిదో అర్థం అయింది. పళ్లు పటపట నూరుతూ మోహన్‌మీది కోపం అంతా గిన్నెలమీద చూపించసాగాడు. అవతల ఫోన్‌లో ఏం చెప్పాడో ఏమో నాగస్వరం విన్న నాగుపాములా మహాలక్ష్మి తల ఊపుతూ ''అలాగే వచ్చేస్తున్నా'' అంటూ ఫోన్ పెట్టేసి నిముషాల్లో తయారైపోయి చెంగున కారు తీసుకుని రయ్‌మంటూ పరుగుతీసింది.

ఆ రోజు ఆదివారం ఆఫీసుకైతే సెలవు. మరి హడావుడిగా ఆ పరుగులేమిటో తెలుసుకోవాలని ఇంటి తలుపులేసి తను కూడా స్కూటర్‌పై మహాలక్ష్మి కారును ఫాలో అయ్యాడు బ్రహ్మం.

పోలీస్ సిగ్నల్ దగ్గరకు కారు వెళ్లిపోగానే పోలీస్ స్టాప్ చెప్పాడు. బ్రహ్మం




స్కూటర్ ఆపేసాడు. అంతవరకూ స్టాప్ బోర్డు పట్టుకుని ట్రాఫిక్‌ను ఆపిన పోలీసు పరబ్రహ్మాన్ని చూడగానే చేతులు దింపేసి కడుపు పట్టుకుని పకపకా నవ్వసాగాడు. చుట్టూవున్న జనం కూడా హహహ అంటూ నవ్వుల్లో మునిగిపోయారు. అసలు వాళ్లంతా తనను చూసి ఎందుకలా నవ్వుతున్నారో మొదట బ్రహ్మంకు అర్థంకాలేదు.

అనుమానమేసి తనకేసి చూసు కున్నాడు. తన కంగారులో చొక్కా-ప్యాంటు వేసుకోవడం మరచిపోయాడు. ఒంటిమీద డ్రాయర్ మటుకే వుంది. అంట్లు తోముతున్నందువల్లనో ఏమో మొహమంతా నల్లటి బొగ్గు మరకలతో చూడడానికి బఫూన్‌లా వుంది అతని అవతారం.

పోలీస్ చెయ్యి దించడంతో ట్రాఫిక్ అంతా అస్తవ్యస్తమయింది. బ్రహ్మం ఎలాగో ఆ ట్రాఫిక్‌ను తప్పించుకుని ఇల్లు చేరుకున్నాడు.

మళ్లీ యధావిధిగా ఇంటి పనంతా చేసి మహాలక్ష్మికై ఎదురు చూడసాగాడు.

★★★

మధ్యాహ్నం ఒంటిగంట తరువాత కారు వచ్చింది. కారులో నుండి దిగుతున్న వాళ్లిద్దర్నీ చూసి బ్రహ్మం అప్రతిభుడై చూడసాగాడు.

మహాలక్ష్మి ఆ వెనకాలే మోహన్ మెడలో దండలతో కొత్త పెళ్లికొడుకు, పెళ్లికూతురు గెటప్‌లో వున్నారు. పెళ్లి కొడుకు సిగ్గుపడుతూ భయం భయంగా నిల్చుని వున్నాడు. మహాలక్ష్మి మోహన్ చెయ్యి పట్టుకుని గబగబా లాక్కుపోయి తన బెడ్‌రూమ్‌లో దూరి తలుపేసుకుంది. బ్రహ్మం నిలబడ లేకపోయాడు.

అయిపోయింది. అంతా అయిపో యింది. తన బ్రతుకంతా సర్వనాశ నమైపోయింది. తన బ్రతుకే వృధా అనుకుని ఆవేశంగా పెరట్లో వున్న బావి దగ్గరకు పరుగెత్తుకుపోయి నూతిలో దూకబోయాడు. ఇంతలో ఎవరో చెయ్యిపట్టి లాగినట్టయి వెనక్కి తిరిగి చూసాడు. కళ్లల్లో నీళ్లు కుక్కుకుని తండ్రి రామలింగయ్య నిల్చుని ఉన్నాడు. తండ్రిని చూడగానే ''నాన్నా...'' అంటూ తండ్రిని కౌగలించుకుని బావురుమన్నాడు.

ఓ అయిదు నిముషాలు ఇద్దరూ ఆరున్నొక్క రాగం తీసారు. మగ పిల్లలున్న ప్రతి ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యం అది. రామలింగయ్య కొడుకును అక్కున చేర్చుకుని ఓదార్చసాగాడు.

''బాబూ! పరబ్రహ్మం మగవాడికి సహనం, ఓర్పు ముఖ్యం నాయనా. నాడు మన పూర్వీకులైన మన తండ్రులు చేసిన తప్పిదాలకు ఈనాడు మనం శిక్షను అనుభవిస్తున్నాం.

గత యాభై సంవత్సరాలుగా ఆడశిశువు పుట్టడమే పాపంగా తలచి స్త్రీ పిండం తల్లి గర్భంలోనే వుండగానే మగవాడి దౌష్ట్యానికి నిర్దాక్షిణ్యంగా బలి అవుతూ వచ్చింది. ఆ కారణంగా స్త్రీల జననం గణనీయంగా తగ్గుతూ వచ్చింది. అందువల్లే మనకు ఈనాడు స్త్రీల కొరత కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. నీ పెళ్లి చేయడానికి నేను ఎన్ని పాట్లు పడ్డానో నీకు తెలియందికాదు. ఉన్న ఇల్లు, పొలం తాకట్టు పెట్టాను. గుండె నిబ్బరం చేసుకో నాయనా. అయినా మోహన్ ఎవరనుకుంటున్నావు?'' అని ఆగాడు.

''ఎవరు?'' ఆసక్తిగా అడిగాడు బ్రహ్మం.

''స్వయానా నీ తమ్ముడే. చిన్నప్పుడే గోదావరి పుష్కరాల్లో తప్పిపోయాడు. దేవుడి దయవల్ల ఈ మధ్యే మన ఇల్లు చేరాడు. మళ్లీ వాడికి కూడా నీకులాగే పెళ్లి సమస్య వచ్చింది. పెళ్లికాని మగవాడి పాట్లు నీకు తెలియందికాదు. నేనే వాడ్ని మహాలక్ష్మి దగ్గరకు చేర్చా'' చెప్పడం పూర్తి చేసాడు రామలింగం.

''అవును బ్రహ్మం. మామయ్య పర్మిషన్ మీదే ఈ పెళ్లి జరిగింది. మీ ఇద్దరిని నా రెండు కళ్లుగా చూసుకుంటా. నీ మనసు నొప్పిస్తే క్షమించు'' అంది అప్పుడే వచ్చిన మహాలక్ష్మి.

మోహన్ పరబ్రహ్మంను ''అన్న య్యా'' అంటూ ప్రేమగా పిలిచాడు.

ఇద్దరూ మహాలక్ష్మికి రెండువైపులా నిల్చున్నారు.

''పదండి...పదండి. ఈ పూట వంట నేను చేస్తాను'' అంటూ వంటింట్లోకి దౌడు తీసాడు రామ లింగయ్య.

అందరూ గలగలా నవ్వుకున్నారు.

★